

పాఠకులు, ప్రకటన కర్తలు,
చందాదారులకు విజయదశమి శుభాకాంక్షలు.

THE SMART NEWS

స్మార్ట్ వార్తలు.. స్పష్టమైన వాస్తవాలు

20.10.2026
మంగళవారం, అమరావతి

సంపుటి: 01 సంచిక: 01
పేజీలు: 02 వెల: 5

## విద్యుత్ కాంతుల్లో ఇంద్రకీలాద్రి..

### దూరప్రాంతాల నుంచి తరలివస్తున్న భవానీలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రి క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోతోంది. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం పరిసరాలు, ఆలయ ప్రాంగణం రంగురంగుల విద్యుద్దీపాల కాంతులతో మిరుమిట్లు గొలుపుతున్నాయి. ఉత్సవాల వేళ అమ్మవారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు, భవానీలు భారీగా తరలివస్తున్నారు. ఎరుపు వస్త్రాలు ధరించి, ఇరుముడులు మోస్తూ కాలినడకన సైతం భవానీ దీక్షాధారులు కొండపైకి చేరుకుంటున్నారు. దీంతో కనకదుర్గమ్మ సన్నిధి 'జై దుర్గా.. భవానీ' నామస్మరణలతో మార్మోగుతోంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం, ఆలయ యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేశాయి. క్యూలైన్లలో తాగునీరు, అల్పాహారం, వైద్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉంచారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఘాట్ రోడ్లు, ప్రవేశ మార్గాల వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి, భక్తులు వేగంగా అమ్మవారి దివ్య దర్శనం చేసుకునేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. - విజయవాడ





సారస్ మేళా బిజినెస్..

## రూ.2.74 కోట్లు

- పున్నమి ఘాట్‌కు పోటెత్తుతున్న సందర్శకులు
- ఇప్పటివరకు 1.13 లక్షల ఉత్పత్తుల విక్రయం

2

చెడుపై విజయానికి

## దసరా ప్రతీక

- ఏపీ ప్రజలకు సీఎం చంద్రబాబు విజయదశమి శుభాకాంక్షలు
- కూటమితోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి
- రాష్ట్ర ప్రజలకు పవన్ కళ్యాణ్ దసరా శుభాకాంక్షలు
- మంచిదే అంతిమ విజయం
- ప్రజలకు వైఎస్ జగన్ విజయదశమి శుభాకాంక్షలు

2

ఆంధ్రప్రదేశ్ లో మునిసిపల్ ఎన్నికల వేడి రాజుకుంది. అధికార, విపక్షాలు హోరాహోరీగా తలపడుతున్నాయి. ఈసారి మునిసిపల్ ఎన్నికల్లో పట్టు నిలబెట్టుకోవాలని అధికార ఎన్డీయే కూటమి పార్టీలు ఆశిస్తున్నాయి. ఉనికి చాటుకోవడానికి వైఎస్సార్సీపీ పాట్లు పడుతోంది. ఈ తరుణంలో మునిసిపల్ ఎన్నికల్లో తాజా పరిస్థితిపై నిర్వహించిన క్షేత్ర స్థాయి పరిశీలనలో సంచలన ఫలితాలు తప్పవన్న సంకేతం కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహిస్తున్న అన్ని మునిసిపాల్టీలలో ఈ పరిశీలన జరిగింది. తెలుగు ప్రైడ్ టీమ్ చేపట్టిన ఈ పరిశీలన ప్రకారం పలుచోట్ల అధికార కూటమి ఎదురీదుతున్నట్టు కనిపిస్తోంది. అక్టోబర్ 19 నాటికి ఉన్న తాజా ఫలితాలను సంస్థ వెల్లడించింది.

# మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఎదురీత

- రెబెల్స్ బెడద.. సమన్వయలేమి
- కొన్ని చోట్ల ప్రభుత్వ వ్యతిరేకత
- క్షేత్ర స్థాయి పరిశీలనలో సంచలన విషయాలు



**అమరావతి:** ఏపీలో ప్రస్తుతం 13 మునిసిపల్ కార్పొరేషన్, 87 మునిసిపల్, నగర పంచాయతీల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. నామినేషన్ల పర్వం ముగిసే సమయానికి 8 చోట్ల ఏకగ్రీవం అనివార్యమయినట్టు కనిపిస్తోంది. నామినేషన్ల పరిశీలన, విత్ డ్రా ప్రక్రియ పూర్తయ్యే నాటికి మరికొన్ని ఏకగ్రీవాలు కూడా తప్పవన్న అభిప్రాయముంది. అయితే ఎన్నికలు జరగబోతున్న 13 మునిసిపల్ కార్పొరేషన్లు, 79 మునిసిపాల్టీ సీట్లలో అత్యధిక స్థానాల్లో కూటమిని రెబెల్స్ వెంటాడుతున్నారు. 34 చోట్ల మునిసిపల్ కార్పొరేషన్లలో రెబెల్స్ ఫలితాలను తారుమారు చేసే స్థాయిలో కనిపిస్తున్నారు. ముఖ్యంగా సర్దుబాటులో టీడీపీకి దక్కిన చోట జనసేన, జనసేన పోటీ చేస్తున్న చోట టీడీపీ రెబెల్స్ ప్రభావం కనిపిస్తోంది. దాంతో రాష్ట్రంలోని కీలకమైన 3 కార్పొరేషన్లలో అక్టోబర్ 19 నాటికి 3 చోట్ల కూటమికి ఎదురీత తప్పడం లేదు. సర్వే ప్రకారం 8 మునిసిపల్ కార్పొరేషన్లలో కూటమికి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తోంది. 2 చోట్ల మాత్రం గట్టిపోటీ ఎదుర్కొంటోంది. రెబెల్స్ కొనసాగితే 3 చోట్ల ఓటమి పాలయ్యే ప్రమాదం ఉంది. తాజా అంచనాల ప్రకారం జీవీఎంసీ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, మచిలీపట్నం, ఒంగోలు, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్లలో కూటమి అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. కొన్ని చోట్ల దాదాపు విజయం దిశలో సాగుతున్నారు. కానీ కర్నూలు, కడపలో గట్టిపోటీ ఎదుర్కొంటున్నారు. పోలింగ్ నాటి పరిణామాలను బట్టి ఈ రెండు చోట్ల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. ఇక విజయనగరం, ఏలూరు, అనంతపురం వంటి కార్పొరేషన్ల పరిధిలో కూటమి అభ్యర్థులు వెనుకబడి ఉన్నారు. విజయనగరంలో టీడీపీ అభ్యర్థికి జనసేన రెబెల్ పోటీలో ఉన్నారు. ఏలూరులో జనసేనకి• **మిగతా 2లో..**



# సంపన్న దేశంలో అశాంతి జ్వాలలు

- ఫ్రాన్స్ నిరసనలకు కారణం ఏంటి?
- వలసలా? ఆర్థిక సంక్షోభమా?
- అక్కడి ప్రభుత్వం ఏం చేస్తోంది

2

# ప్రజల పక్షం.. మా అక్షరం

సమాచార విస్ఫోటనం జరుగుతున్న ఈ డిజిటల్ యుగంలో వార్తలకు కొదవ లేదు. క్షణాల్లోనే సమాచారం మన కళ్లముందు ప్రత్యక్షమవుతోంది. కానీ ఈ సమాచార ప్రవాహంలో నిజం ఏది? వక్రీకరణ ఏది? అన్న ప్రశ్నలకు సమాధానాలు దొరకడం సవాలుగా మారింది. రాజకీయ వ్యూహాలు, అధికార ప్రయోజనాలు, కార్పొరేట్ ఒత్తిళ్ల వెనుక వాస్తవాలను వెలికితీసి ప్రజల ముందుంచాల్సిన బాధ్యత పత్రికారంగంపై పెరిగింది. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ అనేది కేవలం ఒక హక్కు కాదు.. అది ప్రజల పట్ల ఒక బాధ్యత. సమాజం సంక్షోభంలో ఉన్నప్పుడు దారి చూపడం, అధికారం తప్పుదారి పట్టినప్పుడు ప్రశ్నించడం, ప్రజల గొంతుక వినిపించనప్పుడు వారికి వేదికగా నిలవడం స్వతంత్ర పత్రికారంగం ప్రధాన కర్తవ్యం. ఈ బాధ్యతను గుర్తిస్తూ, విశ్వసనీయమైన సమాచారాన్ని ప్రజలకు అందించాలనే సంకల్పంతో 'ది స్మార్ట్ న్యూస్' తన సంపాదకీయ విధానాన్ని పాఠకుల ముందుంచుతోంది.

**అనుభవమే పునాది.. నిబద్ధతే ప్రమాణం**

ఒక వార్తా సంస్థకు విశ్వసనీయతే అసలైన ఆస్తి. అది సంచలన శీర్షికలతోనో, సాంకేతిక హంగులతోనో రాదు. క్షేత్రస్థాయి అనుభవం, నిరంతర అధ్యయనం, వాస్తవాల పరిశీలన, వృత్తిగత నైతికతతోనే ఏర్పడుతుంది. 'ది స్మార్ట్ న్యూస్' సంపాదకీయ దృక్పథం అనుభవజ్ఞులైన జర్నలిస్టుల వృత్తి విలువలు, సమకాలీన రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిణామాలపై సమగ్ర అవగాహనపై ఆధారపడి ఉంటుంది. వార్త సేకరణ నుంచి వాస్తవ నిర్ధారణ, సంబంధిత పక్షాల అభిప్రాయాల సేకరణ, సమతుల్య ప్రచురణ వరకు ప్రతి దశలోనూ బాధ్యతాయుతమైన సంపాదకీయ ప్రమాణాలను పాటించేందుకు మేము కట్టుబడి ఉంటాం. వేగం కోసం నిజాన్ని విస్మరించం. సంచలనం కోసం వాస్తవాలను వక్రీకరించం. పాఠకుల నమ్మకాన్ని దెబ్బతీసే ఏ ధోరణికీ చోటివ్వం.

**రాజకీయాలకు అతీతంగా.. ప్రజల ప్రయోజనాలే ప్రథమం**

'ది స్మార్ట్ న్యూస్' ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా పనిచేయదు. ఏ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం లక్ష్యంగా పెట్టుకోదు. మా సంపాదకీయ వైఖరిని నిర్ణయించేది రాజకీయ అనుబంధాలు కాదు.. ప్రజా ప్రయోజనాలు, వాస్తవాలు, ప్రజాస్వామ్య విలువలు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించాల్సి వస్తే ప్రశ్నిస్తాం. ప్రతిపక్షాల వైఖరిలో లోపాలుంటే వాటినీ ఎత్తిచూపుతాం. ప్రజలకు మేలు చేసే నిర్ణయం ఎవరు తీసుకున్నా స్వాగతిస్తాం. ప్రజలకు నష్టం కలిగించే నిర్ణయం ఎవరు తీసుకున్నా విమర్శిస్తాం.

**మాకు అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా కంటే ప్రజల పక్షమే ముఖ్యం.**

**వార్త వేరు.. అభిప్రాయం వేరు**

వాస్తవాలను వాస్తవాలుగానే, అభిప్రాయాలను అభిప్రాయాలుగానే పాఠకుల ముందుంచడం మా ప్రాథమిక సూత్రం. వార్తల్లో వ్యక్తిగత అభిప్రాయాలు, రాజకీయ పక్షపాతాలు, నిరాధార ఆరోపణలకు తావివ్వకుండా జాగ్రత్తపడతాం.

మా పని పాఠకుల తరపున ఆలోచించడం కాదు.. వారు స్వతంత్రంగా ఆలోచించేందుకు అవసరమైన నిజమైన సమాచారాన్ని అందించడం.

**సామాన్యుడి గొంతుక..**

పత్రికారంగం అధికార కేంద్రాల చుట్టూ, ప్రముఖుల ప్రకటనల చుట్టూ మాత్రమే తిరగకూడదు. సమాజపు అసలైన చిత్రం సామాన్యుడి జీవితంలో కనిపిస్తుంది. అందుకే సామాన్య ప్రజల సమస్యలు, వారి హక్కులు, వారి ఆశలు, ఆకాంక్షలకు 'ది స్మార్ట్ న్యూస్'లో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. రైతాంగం ఇబ్బందులు, కార్మికుల హక్కులు, నిరుద్యోగుల ఆందోళనలు, యువత భవిష్యత్తు, మహిళల భద్రత, అణగారిన వర్గాల గళం మా ప్రాధాన్యాల్లో ముందుంటాయి. ప్రభుత్వ విధానాలు, చట్టాలు, సంక్షేమ పథకాలు ప్రజల రోజువారీ జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో పరిశీలిస్తాం. సమస్యను వార్తగా ప్రచురించి వదిలేయకుండా, దాని మూలాలను అన్వేషించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం దిశగా జరిగే పరిణామాలను అనుసరిస్తాం. ప్రజల సమస్యకు ప్రచారం కల్పించడం మాత్రమే కాదు.. వారి గొంతుకకు బలం చేకూర్చడం కూడా మా బాధ్యత.

**ప్రజాస్వామ్యానికి నిర్మాణాత్మక ప్రతిపక్షంగా..**

ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే ప్రశ్నించే గొంతులు స్వేచ్ఛగా ఉండాలి. అధికారాన్ని ప్రశ్నించని వ్యవస్థలో జవాబుదారీతనం బలహీనపడుతుంది. అందుకే పత్రికారంగం ప్రజాస్వామ్యానికి ఒక నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలి. అధికారంలో ఉన్నవారిని అసౌకర్యానికి గురిచేస్తుందనే కారణంతో ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ప్రశ్నలను పక్కనపెట్టం. అదే సమయంలో, నిరాధార ఆరోపణలను వార్తలుగా ప్రచారం చేయం.

**మా లక్ష్యం వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవడం కాదు.. వ్యవస్థలను జవాబుదారీగా నిలబెట్టడం.**

**విమర్శలో నిష్పాక్షికత.. ప్రశంసలో నిజాయితీ**

విమర్శించడం మాత్రమే పత్రికారంగం పని కాదు. తప్పులను ఎత్తిచూపినట్లే, ప్రజలకు మేలు చేసే నిర్ణయాలను గుర్తించడం కూడా అంతే ముఖ్యం. ప్రభుత్వ విధానాల్లో లోపాలుంటే నిర్భయంగా ప్రశ్నిస్తాం. ప్రజావ్యతిరేక నిర్ణయాలపై వాస్తవాలతో స్పందిస్తాం. అదే సమయంలో ప్రజలకు ప్రయోజనం కలిగించే సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ చర్యలను ఎలాంటి పక్షపాతం లేకుండా అభినందిస్తాం. మా విమర్శ విధ్వంసం కోసం కాదు.. మార్పు కోసం. మా ప్రశంస రాజకీయ అనుకూలత కోసం కాదు.. ప్రజలకు కలిగిన ప్రయోజనాన్ని గుర్తించడం కోసం. వ్యక్తిని బట్టి మా వైఖరి మారదు. అంశాన్ని బట్టి మా విశ్లేషణ ఉంటుంది.

**సమస్యలే కాదు.. పరిష్కారాలూ చూపిస్తాం**

సమాజంలో సమస్యలను వెలుగులోకి తీసుకురావడం పత్రికారంగం బాధ్యతలో ఒక భాగం మాత్రమే. వాటి మూలాలను విశ్లేషించడం, పరిష్కార మార్గాలను అన్వేషించడం, అవసరమైన చర్చకు వేదిక కల్పించడం కూడా అంతే ముఖ్యం. అందుకే సమస్యలను సంచలనాలుగా మార్చి వదిలేయడం మా ధోరణి కాదు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, పర్యావరణం, పట్టణాభివృద్ధి, గ్రామీణ సమస్యలు వంటి అంశాలపై లోతైన పరిశీలనకు ప్రాధాన్యం ఇస్తాం. నిపుణులు, మేధావులు, సంబంధిత వర్గాల అభిప్రాయాలను సమన్వయం చేసి, ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను పాఠకుల ముందుంచేందుకు ప్రయత్నిస్తాం. కారణాలను విశ్లేషించడం ద్వారా స్పష్టతనిస్తాం. పరిష్కారాలను చర్చించడం ద్వారా మార్పుకు దోహదపడతాం. సమాజంలో నిర్మాణాత్మక చర్చకు, సానుకూల మార్పుకు వేదికగా నిలవడమే మా లక్ష్యం.

**మా పాఠకులే మా బలం**

పాఠకుల విశ్వాసం ఒకసారి సంపాదిస్తే సరిపోదు. ప్రతి వార్తతో, ప్రతి విశ్లేషణతో, ప్రతి సంపాదకీయ నిర్ణయంతో దాన్ని నిలబెట్టుకోవాలి. అందుకే పాఠకుల అభిప్రాయాలకు, ప్రశ్నలకు, నిర్మాణాత్మక విమర్శలకు మేము విలువనిస్తాం. మా ప్రచురణలో పొరపాటు జరిగితే సరిదిద్దేందుకు సిద్ధంగా ఉంటాం. వార్తకు సంబంధించిన విశ్వసనీయ ఆధారాలను పరిశీలిస్తాం. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో పారదర్శకతను పాటిస్తాం. విశ్వాసాన్ని మాటలతో కాదు.. మా పనితీరుతో నిరూపించుకోవాలనుకుంటాం.

**మా సంకల్పం:** నిజం మా ప్రమాణం. నిష్పాక్షికత మా విధానం. ప్రజాహితం మా లక్ష్యం. జవాబుదారీతనం మా బాధ్యత. రాజకీయాలకు అతీతంగా, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, ప్రజల సమస్యలకు ప్రాధాన్యమిస్తూ 'ది స్మార్ట్ న్యూస్' ముందుకు సాగుతుంది. అధికారాన్ని ప్రశ్నించాల్సినప్పుడు ప్రశ్నిస్తాం. ప్రజల గొంతుక వినిపించాల్సినప్పుడు వినిపిస్తాం. ప్రజల పక్షాన నిలబడతాం. నిజాలనే రాస్తాం. బాధ్యతతో ప్రశ్నిస్తాం. మార్పు కోసం పనిచేస్తాం.

**ఇది మా మాట మాత్రమే కాదు.. మా సంపాదకీయ నిబద్ధత.**

మా ఈ ప్రయత్నానికి మీ అందరి సంపూర్ణ సహకారం అందుతుందని ఆశిస్తూ..

– ధన్యవాదాలతో
ది స్మార్ట్ న్యూస్ ఎడిటోరియల్ టీమ్

# నెల్లూరుకు కొత్త రూప్ వస్తుందా?

- జనరల్ స్థానంలో బీసీ.. కూటమి వ్యూహాత్మక అడుగు
- ఎన్డీయే మేయర్ అభ్యర్థిగా రూప్ కుమార్ యాదవ్
- అనుభవం, ప్రజాసేవ, అభివృద్ధి ఎజెండాతో ముందుకు
- ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం
- క్లిష్ట పరిస్థితుల్లో అండగా నిలిచే సేవాభావం
- గతంలో మేయర్ గా పనిచేయడంతో సమస్యలపై అవగాహన



**నెల్లూరు**

నెల్లూరు నగర పాలక సంస్థ రాజకీయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. కార్పొరేషన్ పీఠం అన్‌రిజర్వ్‌డ్ అయినప్పటికీ, బలమైన సామాజిక వర్గాల కంచుకోటగా పేరున్న నెల్లూరులో ఎన్డీఏ కూటమి బీసీ నేత పి. రూప్ కుమార్ యాదవ్‌ను మేయర్ అభ్యర్థిగా బరిలోకి దింపడం రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. రూప్ కుమార్ రాజకీయాల్లో అంచలంచెలుగా ఎదిగి ప్రజల మన్ననలు పొందిన నేత. కార్పొరేటర్‌గా, విపక్ష ఫ్లోర్ లీడర్‌గా, డిప్యూటీ మేయర్‌గా, మేయర్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. కార్పొరేషన్ వ్యవస్థ, నగర సమస్యలు, స్థానిక రాజకీయ సమీకరణాలపై అవగాహన ఏర్పడింది. నిత్యం ప్రజలతో మమేకమయ్యే నాయకుడిగా గుర్తింపు పొందడం రూప్ కుమార్ కు కలిసి వచ్చే అంశం. కరోనా మహమ్మారి సమయంలోనూ, తుపాన్లు, భారీ వర్షాల సమయంలోనూ ప్రజలకు సహాయం చేయడంలో రూప్ కుమార్ చూపిన చొరవను ఆయన వర్గం ప్రస్తావిస్తోంది.

**గెలిస్తే నెల్లూరుకు కలిగే ప్రయోజనాలు**

నెల్లూరును ఆధునిక, స్మార్ట్ నగరంగా తీర్చిదిద్దడానికి రూప్ కుమార్ గెలుపు అత్యంత కీలకం. ఆయన మేయరైతే నగరానికి చేకూరే ప్రయోజనాలు:

1. నిధుల వెల్లువ - అభివృద్ధి పరుగులు: రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో నగరానికి భారీగా మౌలిక వసతుల నిధులు రాబట్టే అవకాశం ఉంటుంది. నిలిచిపోయిన రోడ్ల విస్తరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను వేగవంతం చేయవచ్చు.
2. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం: శివారు విలీన గ్రామాలు, కాలనీల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన కుళాయి నీరు అందించే బృహత్ ప్రాజెక్టుల అమలు.
3. వరద ముంపు నివారణ చర్యలు: నెల్లూరు నగరాన్ని వర్షాకాలంలో ముంచెత్తే వరద కాలువలు, డ్రైనేజీలకు శాశ్వత రక్షణ గోడలు, ఆధునిక పూడికతీత వ్యవస్థ ఏర్పాటు.
4. పారదర్శక నగర పాలన: మున్సిపల్ కార్యాలయాల్లో దళారీ వ్యవస్థను నిర్మూలించి, ప్రజలకు భవన నిర్మాణ అనుమతులు, ట్రేడ్ లైసెన్సులు, జననమరణ ధ్రువీకరణ పత్రాలు సులభంగా, అవినీతి రహితంగా అందేలా సిటిజన్ సర్వీస్ డెస్క్‌ల ఆధునీకరణ.
5. ట్రాఫిక్ కష్టాలకు చెక్: పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా ఫ్లైఓవర్లు, రింగ్ రోడ్ అనుసంధానాలు, సురక్షితమైన ఫుట్‌పాత్‌లు, వెండర్ జోన్ల నిర్మాణం.

### ఓసీ స్థానం.. బీసీ అభ్యర్థి

నెల్లూరు మేయర్ స్థానం అన్‌రిజర్వ్‌డ్‌గా ఉండగా, కూటమి బీసీ సామాజిక వర్గానికి చెందిన రూప్ కుమార్ ను అభ్యర్థిగా నిలబెట్టింది. ఈ పరిణామం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా బీసీ నాయకుడికి అవకాశం కల్పించడాన్ని ఆయన మద్దతుదారులు సామాజిక ప్రాతినిధ్యానికి సంకేతంగా అభివర్ణిస్తున్నారు. రూప్‌కు మైనార్టీలతో పాటు ఇతర సామాజిక వర్గాల్లోనూ పరిచయాలు, మద్దతు ఉన్నాయని ఆయన అనుచరులు చెబుతున్నారు.

**నగర అభివృద్ధికి 'పంచసూత్రాల' ప్రణాళిక**

1. క్లీన్ & గ్రీన్ నెల్లూరు: ఆధునిక వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ పటిష్టం.
2. శివారు ప్రాంతాల అభివృద్ధి: నగరంతో సమానంగా కొత్త లేఅవుట్లు, శివారు కాలనీల్లో మౌలిక వసతులు.
3. యువతకు ఉపాధి - నైపుణ్యం: కార్పొరేషన్ పరిధిలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు.
4. పబ్లిక్ పార్కులు - ఆట స్థలాలు: ప్రతి డివిజన్‌లో పచ్చదనం, వాకింగ్ ట్రాక్‌లు, క్రీడా మైదానాల పునరుద్ధరణ.
5. పేదలకు మెరుగైన ఆరోగ్యం: కార్పొరేషన్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఉచిత వైద్యం, మందుల పంపిణీ విస్తరణ.

**తెరవెనుక అసలు చక్రం**

రూప్ కుమార్ ప్రజాప్రతినిధి మాత్రమే కాదు, అపారమైన వ్యూహాలు రచించగల పొలిటికల్ స్ట్రాటజిస్ట్. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌కు రాజకీయాల్లో చేయిపట్టి ఓనమాలు నేర్పించింది బాబాయ్ రూప్ కుమారే. అనిల్ చక్రం తిప్పినంత కాలం తెర వెనుక ఉండి నడిపించిన అసలు శక్తి రూప్ కుమార్. అయితే అనిల్ నోటి దురుసు ప్రవర్తన, అంతర్గత విభేదాల కారణంగా ఆయన దూరంగా జరిగారు. ఆ తర్వాత నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఘన విజయం సాధించడంలో రూప్ కుమార్ కీలకపాత్ర పోషించారు.

**కూటమి సమన్వయం..**

**అభివృద్ధికి అవకాశాలు**

రూప్ గెలిస్తే టీడీపీ, జనసేన, బీజేపీ నేతల మధ్య సమన్వయం కొనసాగితే నగర అభివృద్ధి ప్రణాళికలను ముందుకు తీసుకెళ్లేందుకు రాజకీయ సహకారం లభించే అవకాశం ఉంటుంది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో పాటు ఇతర కూటమి నేతల సహకారంతో నగర అవసరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లవచ్చు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నగరంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం రూప్ ప్రచారంలో ప్రధాన అంశంగా కనిపిస్తోంది. అయితే నేతల మద్దతును క్షేత్రస్థాయి ఓటర్ల ఆదరణగా మార్చుకోవడం ఏ అభ్యర్థికైనా కీలకమే.

**నిర్భయమైన నాయకత్వం**

గతంలో వైసీపీలో నంబర్ టూగా చక్రం తిప్పిన విజయసాయిరెడ్డిని సైతం నేరుగా ఢీకొట్టిన ధైర్యం రూప్ కుమార్ ది. గత సార్వత్రిక ఎన్నికల్లో బుచ్చిరెడ్డిపాలెంలో విజయసాయి రిగ్గింగ్‌కు యత్నించిన సమయంలో, రూప్ కుమార్ రంగంలోకి దిగి అడ్డుకున్న తీరు ఇప్పటికీ చర్చనీయాంశమే. వ్యక్తిగత సంబంధాలు, రాజకీయ సమీకరణాలు మారినా నగర రాజకీయాలపై తన పట్టును కొనసాగించడమే రూప్ ప్రత్యేకతగా ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు.

**అభివృద్ధే ప్రచార అస్త్రం!**

నెల్లూరుకు కూటమి ప్రభుత్వం చేసిన, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలే తన విజయానికి తోడ్పడతాయని రూప్ కుమార్ ప్రచారంలో చెబుతున్నట్లు ఆయన వర్గం వెల్లడిస్తోంది. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వరద ముంపు నివారణ, పారిశుధ్యం, ట్రాఫిక్ నిర్వహణ వంటి సమస్యలకు పరిష్కారాలు చూపడం నగర ఓటర్లకు కీలకమైన అంశాలు. కూటమి ప్రభుత్వం నుంచి నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడంతో పాటు వాటిని సమర్థంగా అమలు చేయడం, ప్రతి డివిజన్‌కు సమాన ప్రాధాన్యం ఇవ్వడం, పౌర సేవల్లో పారదర్శకత పాటించడం వంటి అంశాలపై అభ్యర్థి వైఖరి కూడా ప్రజల దృష్టిలో ఉంటుంది.

## ప్రజా తీర్పుతో నెల్లూరుకు కొత్త దిశ?

నెల్లూరు నగరం వేగంగా అభివృద్ధి చెందాలంటే తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్యం వంటి ప్రాథమిక సదుపాయాల నుంచి యువతకు అవకాశాలు, పచ్చదనం, ప్రజారోగ్యం, పారదర్శక పరిపాలన వరకు ప్రతి అంశంపై సమగ్ర ప్రణాళిక ఉండాలి. గత అనుభవంతో రూప్ కుమార్ ఈ అంశాలపై స్పష్టమైన కార్యాచరణను ముందుకు తీసుకెళ్లగలిగితే నెల్లూరు అభివృద్ధిలో కొత్త అధ్యాయానికి అవకాశం ఉంటుంది. కూటమి నాయకత్వం నుంచి లభించే సహకారాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించుకోవడం, ప్రతి డివిజన్‌కు సమాన ప్రాధాన్యం ఇవ్వడం, ప్రజలకు ఇచ్చిన హామీలను ఫలితాలుగా మార్చడం ఆయన నాయకత్వానికి అసలైన పరీక్షగా నిలుస్తాయి. నెల్లూరు అభివృద్ధి.. ప్రజల భాగస్వామ్యం.. పారదర్శక పాలన.. సమాన అవకాశాలు — ఈ నాలుగు అంశాల సమన్వయంతోనే నెల్లూరు ఆదర్శ నగరంగా ఎదగగలదు. ప్రజల ఆశలను అభివృద్ధి ఫలితాలుగా మార్చే నాయకత్వం కోసం నెల్లూరు నగరం ఎదురుచూస్తోంది. రాజకీయ అనుభవం ఓట్లుగా మారుతుందా? కూటమి సమన్వయం నగర ప్రజల మద్దతును సంపాదిస్తుందా? బీసీ అభ్యర్థిత్వం ఎలాంటి ప్రభావం చూపుతుంది? ఈ ప్రశ్నలకు ప్రజల తీర్పే సమాధానం చెప్పనుంది.

# సంపన్న దేశంలో అశాంతి జ్వాలలు

**స్పెషల్ డెస్క్**



ఫ్రాన్స్‌లో నిరసనలు పదేపదే ఎందుకు చెలరేగుతున్నాయి? కారణం అక్రమ వలసదారులేనా? స్కూల్స్‌ను బాగు చేయండంటూ మొదలైన ఉద్యమం... అంతకంతకూ పెరుగుతోందా? అంతకుమించి ఏమైనా ఉందా? పేదలు, సామాన్యులు సైతం ఎందుకు తిరగబడుతున్నారు... ఫ్రాన్స్ ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటి. ఈ దేశంలో అత్యాధునిక నగరాలున్నాయి. యూరప్‌లో అత్యధికంగా సందర్శించే దేశం ఇదే. విద్య, ఆరోగ్య సంరక్షణతో సహా పటిష్టమైన ప్రభుత్వ వ్యవస్థ ఉంది. అయినప్పటికీ, ప్రభుత్వ నిర్ణయాలపై ఇక్కడ తరచుగా పెద్ద నిరసనలు చెలరేగుతున్నాయి. పారిస్‌లో యుద్ధ వాతావరణం నెలకొంది. షాపుల్లో దోపిడీలకు తెగబడుతున్నారు.

**విద్యార్థుల ఉద్యమం నుంచి కార్మికుల సమ్మెల దాకా**

పాఠశాలల్లో సదుపాయాల కొరత, విద్యారంగం పరిస్థితులు, పెరుగుతున్న నిత్యావసర ధరలకు వ్యతిరేకంగా మొదలైన ఆందోళనలు తీవ్రమయ్యాయి. కొన్నిసార్లు పింఛను మార్పులకు నిరసనగా లక్షలాది మంది కార్మికులు సమ్మె చేస్తారు, మరికొన్నిసార్లు పెరుగుతున్న ఇంధన ధరలకు నిరసనగా సామాన్య ప్రజలు వీధుల్లోకి వస్తారు. ఇప్పుడు, పాఠశాలల దుస్థితిపై ప్రారంభమైన ఒక విద్యార్థి ఉద్యమం, ద్రవ్యోల్బణం, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఒక పెద్ద నిరసనగా మారింది. ఫ్రాన్స్‌లో, ప్రజలు తమ డిమాండ్లను నెరవేర్చుకోవడానికి వీధుల్లోకి వచ్చినప్పుడు, తరచుగా ఇతర వర్గాల సభ్యులు కూడా వారితో కలుస్తారు. విద్యార్థుల నిరసనలు కార్మికుల సమ్మెగా మారి, దేశం మొత్తం కార్యకలాపాలను ప్రభావితం చేస్తాయి.

**సంపద కేంద్రీకరణ – పేదరికంలో కోట్లాది మంది**

ఫ్రాన్స్ చాలా సంపన్న దేశం. ఇక్కడ తలసరి ఆదాయం 51 వేల డాలర్లు... మన తలసరి ఆదాయం 2 వేల 800 డాలర్లు మాత్రమే. దేశం డబ్బున్నదే అయినా... ప్రతి కుటుంబంలో అది ఉండదు. ఫ్రాన్స్‌కు పెద్ద ఆర్థిక వ్యవస్థ ఉంది, కానీ దేశ మొత్తం సంపద సగటు కుటుంబ సంపదను ప్రతిబింబించదు. ఇక్కడ గణనీయమైన సంఖ్యలో ప్రజలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 2024 లెక్కల ప్రకారం... దేశంలో 98 లక్షల మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. దేశంలో జనాభా... ఏడు కోట్లమంది ఉన్నారు. దేశ జనాభాలో 15.4 శాతం మంది పేదవారే. ఫ్రాన్స్‌లో నెలకు ఒక వ్యక్తి ఆదాయం 1,337 యూరోలకన్నా తక్కువ ఉంటే పేదవానిగానే భావిస్తారు.

**ఖరీదైన జీవనం – సామాన్యుడిపై మోయలేని భారం**

యూరప్‌లో ఏ దేశంలోనూ ఏదీ ఫ్రీ కాదు. ప్రతిదానికి డబ్బు ఖర్చు చేయాల్సిందే. చాలా ఖరీదైన దేశాలు... నగరాలూ. డబ్బు లేకపోతే ఒకచోటు నుంచి ఇంకో చోటుకు కదిలే పరిస్థితి లేదు. దేశంలో అత్యంత ధనిక 10% కుటుంబాల చేతుల్లో... 48 శాతం సంపద ఉంది. అత్యంత పేదల్లోని 50 శాతం మంది దగ్గర 7 శాతం ఆదాయమే ఉంది. ఇంటి అద్దె, విద్యుత్, ఆహారం, ఇంధనం వంటివి ఖరీదైనవిగా మారాయి. తక్కువ, మధ్య ఆదాయ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఆదాయం మొత్తం రోజువారీ ఖర్చులకే కరిగిపోతోంది.

**పింఛన్ల వివాదం – భవిష్యత్ ఆర్థిక భద్రతపై ఆందోళన**

ఫ్రాన్స్‌లో, పింఛన్లు, ఉపాధికి సంబంధించిన ప్రభుత్వ నిర్ణయాలు తరచుగా గణనీయమైన వివాదానికి కారణమవుతాయి, ఎందుకంటే అవి ప్రజల సంపాదన, పని జీవిత కాలం, భవిష్యత్ ఆర్థిక భద్రతపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి. 2023లో ప్రభుత్వం పదవీ విరమణ వయస్సును 62 నుండి 64కు పెంచుతూ ఒక చట్టాన్ని ఆమోదించింది. తమ పింఛను పొందడానికి ఇప్పుడు మరో రెండు సంవత్సరాలు పనిచేయాల్సి వస్తోందని కొందరు ఆందోళనకు దిగారు. ఇది దేశవ్యాప్తంగా నిరసనలు, సమ్మెకు దారితీసింది.

**పాఠశాలల దుస్థితి – తల్లిదండ్రుల మద్దతు**

ఇటీవలే పాఠశాలల దుస్థితికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, కిక్కిరిసిన తరగతి గదులు, సరిపోని భవనాలున్నాయంటూ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. తమకు మంచి విద్య అందకపోతే, ఉద్యోగాలు సంపాదించుకునే అవకాశాలు, మెరుగైన భవిష్యత్తు దెబ్బతింటాయని వారు ఆందోళన చెందుతున్నారు. వారికి తల్లిదండ్రులు సైతం జత కలిశారు.

**జీడీపీలో 119 శాతం రుణం – బడ్జెట్ కొరతతో చెలరేగిన హింస**

ఫ్రాన్స్... పెరుగుతున్న ప్రభుత్వ రుణ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. 2026 జూన్ చివరి నాటికి దేశ ప్రభుత్వ రుణం... జీడీపీలో 119 శాతానికి సమానంగా ఉంది. ప్రభుత్వం విద్య, ఆసుపత్రులు, పింఛన్లు, రక్షణపై ఖర్చు చేయాల్సి ఉండటంతో... బడ్జెట్ సరిపోవడం లేదు. దీంతో ఆందోళనకారులు... దొరికింది దొరికినట్లు తగులబెడుతున్నారు. పలు భవనాలకు సైతం నిప్పు పెట్టారు. 2024 ఫ్రెంచ్ పార్లమెంటరీ ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజార్టీ రాలేదు. అయితే పాలకులు మాత్రం... దేశంలోకి విపరీతంగా వలసలు పెరిగిపోవడం వల్లే... సమస్యలు వస్తున్నాయంటూ తప్పుడు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు.

# సారస్ మేళా బిజినెస్.. రూ.2.74 కోట్లు



- పున్నమి ఘాట్‌కు పోటెత్తుతున్న సందర్శకులు
- గ్రామీణ ఉత్పత్తులకు జైకొట్టిన నగరవాసులు
- ఇప్పటివరకు 1.13 లక్షల ఉత్పత్తుల విక్రయం
- ఈ నెల 31 వరకు కొనసాగనున్న ప్రదర్శన

**విజయవాడ:**

విజయవాడలోని పున్నమి ఘాట్ వేదికగా జరుగుతున్న "జాతీయ సారస్ మేళా-2026" ప్రజల విశేష ఆదరణతో దూసుకుపోతోంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాలు (SHGs) రూపొందించిన వినూత్న, నాణ్యమైన ఉత్పత్తులు నగరవాసులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. దీంతో స్టాళ్ల వద్ద కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి.

**రికార్డు స్థాయిలో విక్రయాలు**

అక్టోబర్ 13న ప్రారంభమైన ఈ మేళాలో ఇప్పటివరకు ఏకంగా రూ.2.74 కోట్ల సంచిత వ్యాపారం నమోదైంది. ప్రారంభం నుంచి ఇప్పటివరకు సుమారు 1.13 లక్షల ఉత్పత్తులను సందర్శకులు కొనుగోలు చేశారు. గ్రామీణ కళాకారులు, స్వయం సహాయక సంఘాల మహిళల నైపుణ్యానికి పట్టణ విపణిలో లభిస్తున్న ఆదరణకు ఈ గణాంకాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**ఒక్కరోజే రూ.కోటి వ్యాపారం**

మేళాకు ఆదివారం (అక్టోబర్ 18) ఒక్కరోజే సందర్శకులు రికార్డు స్థాయిలో పోటెత్తారు. ఒక్కరోజే 60 వేల మందికి పైగా ప్రజలు పున్నమి ఘాట్‌కు తరలివచ్చారు. ఆ ఒక్కరోజే సుమారు 39,690 వస్తువులు విక్రయమవగా, ఏకంగా రూ.1 కోటి మేర వ్యాపారం జరగడం విశేషం. చేనేత వస్త్రాలు, చేతివృత్తుల కళాఖండాలు, సంప్రదాయ ఆహార పదార్థాలు, గృహోపకరణాల స్టాళ్ల వద్ద కొనుగోలుదారుల రద్దీ కనిపించింది.

**మహిళా సాధికారతకు వేదిక**

గ్రామీణ జీవనోపాధిని పటిష్ఠం చేయడంతో పాటు, మహిళలను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడంలో సారస్ మేళా అద్భుత వేదికగా నిలుస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా వినియోగదారులకే వస్తువులను విక్రయించుకునే అవకాశం లభించడంతో గ్రామీణ మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ జాతీయ ప్రదర్శన అక్టోబర్ 31వ తేదీ వరకు కొనసాగనుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## చెడుపై విజయానికి దసరా ప్రతీక

**అమరావతి:**

చెడుపై మంచి సాధించిన చారిత్రక విజయానికి ప్రతీకగా నిలిచే పవిత్ర విజయదశమి పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. అన్యాయం, అధర్మం ఎంత బలంగా కనిపించినా.. అంతిమంగా ధర్మం, న్యాయమే విజయం సాధిస్తాయన్న గొప్ప జీవన సత్యాన్ని దసరా మనకు నిరంతరం గుర్తుచేస్తుందని ఆయన పేర్కొన్నారు.

**జగన్మాత ఆశీస్సులతో ప్రగతి పథంలో ఆంధ్రప్రదేశ్**

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మ దివ్య ఆశీస్సులతో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అజేయమైన విజయాలు సాధించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. సంక్షేమం, సమగ్ర అభివృద్ధి సమపాళ్లలో మేళవించి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా నడిపించేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని స్పష్టం చేశారు. చెమటోడ్చి దేశానికి అన్నంపెట్టే రైతన్నల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పచ్చగా పండాలని కోరుకున్నారు. సమాజంలో సగభాగమైన మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా రాణించి సంపూర్ణ సాధికారత సాధించాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, విజయదశమి తెచ్చే సరికొత్త వెలుగులు ప్రజల జీవితాల్లో సరికొత్త ఉత్సాహాన్ని, నూతనోత్తేజాన్ని నింపాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఎదురీత

( మొదటిపేజీ తరువాయి )

టీడీపీ నుంచి తిరుగుబాటు అభ్యర్థి కారణంగా ఓట్ల చీలిక తప్పేలా లేదు. అనంతపురం బీజేపీకి కేటాయించడంతో టీడీపీలో ఉన్న అసంతృప్తి విపక్షానికి బలంగా మారుతోంది. కూటమి పక్షాల మధ్య సమన్వయ సమస్య ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. పోటీ అభ్యర్థులు రంగంలో దిగకుండా నిలువరించే ప్రయత్నం చేయలేక పోయారు. దాని తాకిడితో ఓట్ల చీలిక కొంప ముంచే స్థాయికి చేరుతుందన్న వాదన ఉంది. 2021 మునిసిపల్ ఎన్నికల్లో అన్ని మునిసిపల్ కార్పొరేషన్లను ఆనాటి అధికార వైఎస్సార్సీపీ తన ఖాతాలో వేసుకుంది. కానీ ప్రస్తుతం పోలింగ్ సజావుగా సాగితే మాత్రం ఒకటి లేదా రెండు చోట్లయినా విపక్షం బోణీ కొట్టే పరిస్థితి కనిపిస్తోంది.

**మునిసిపాలిటీలలోనూ అదే తంత..**

ఏపీలో ఇప్పటికే ఉమ్మడి కడప జిల్లాతో పాటుగా పల్నాడు, అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లోని పలు మునిసిపాల్టీలు ఏకగ్రీవమయ్యాయి. మరికొన్ని అదే దిశలో ఉన్నాయి. 8 మునిసిపాలిటీలలో స్పష్టత రాగా, ఆ సంఖ్య రెండంకెలకు చేరే దిశలో ఉంది. అదే జరిగితే మిగిలిన 75 స్థానాలకు పైబడిన మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో సైతం రెబెల్స్ బెడద కనిపిస్తోంది. ఆఖరికి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడి భార్య బరిలో ఉన్న నర్సీపట్నంలో జనసేన అభ్యర్థిగా అద్దేపల్లి సౌజన్య పోటీలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితి అనేక చోట్ల ఉంది. చివరకు పిఠాపురం నియోజకవర్గంలో కూడా. వాటిలో ఎన్ని సర్దుబాటు చేసుకోగలరన్నదే తుది ఫలితాల్లో నిర్ణయాత్మకమవుతుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం ఎన్నికలు జరిగే స్థానాల్లో దాదాపుగా 80 శాతం కూటమికే మొగ్గు ఉంది. కానీ పాలకొండ, నెల్లిమర్ల, యలమంచిలి, తుని, నూజివీడు, చిలకలూరిపేట, గిద్దలూరు, పులివెందుల, మడకశిర వంటి చోట్ల వైఎస్సార్సీపీకి కొంత అనుకూలత ఉంది. ఇలాంటి సమస్యలు



న్న వాటిలో పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు కూడా కనిపిస్తోంది. దానికి కూడా రెబెల్స్, కూటమిలో సఖ్యత లోపించడం వంటివి ప్రధాన కారణాలు. వాటిని సరిచేసుకుని ఎన్నికల నాటికి సమస్యలు పరిష్కరించుకోలేకపోతే వాటిలో కొన్ని కోల్పోయేందుకు కారణమవుతాయి. మొత్తంగా 2021 నాటి ఫలితాలు భిన్నంగా ఈసారి విపక్షం కొంత ఉనికి చాటుకునే దిశలో ఉంది. కానీ అది పోలింగ్ సజావుగా సాగితే మాత్రమే అనే అభిప్రాయం ఓటర్ల నుంచి వినిపించింది.

**అభ్యర్థుల ఎంపిక కూడా..**

అధికార కూటమి తరుపున బరిలో నిలిచిన అభ్యర్థుల ఎంపికపై కూడా పలువురిలో అసంతృప్తి ఉంది. విజయవాడలో టీడీపీ నుంచి జనసేన కండువా కప్పుకోగానే వంగవీటి రాధాకి మేయర్ సీటు దక్కింది. సంప్రదాయంగా టీడీపీ ఓటర్లుగా ఉన్న కమ్మ కులస్తుల్లో ఇది కూసింత అసంతృప్తిని రాజేసింది. టీడీపీలో కూడా సీనియర్లకు కంటగింపుగా మారింది. వంగవీటి నామినేషన్ కార్యక్రమానికి బొండా ఉమా వంటి వారు దూరంగా ఉండడం అందుకు నిదర్శనం. కనిగిరి మునిసిపాలిటీలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆఫీసులో పనిచేస్తున్న అచ్చాల తిరుపతమ్మను బరిలో దింపడం టీడీపీలోనే కాక రేపుతోంది. సాలూరు జనసేనకి కేటాయించగా, వైఎస్సార్సీపీ నుంచి వచ్చిన నేతను ఎంపిక చేయడం మంట పుట్టిస్తోంది. ఇలా అనేక చోట్ల అభ్యర్థుల ఎంపిక మీద అసంతృప్తులు రాజుకున్నాయి. సాధారణ ఎన్నికల నాటి స్థాయిలో మూడు పక్షాల శ్రేణులు మూకుమ్మడిగా పట్టుబట్టేందుకు సిద్ధంగా కనిపించడం లేదు. అభ్యర్థుల ఎంపికలో సమర్థులకు ఛాన్స్ దక్కలేదన్న వాదన బలంగా ఉంది. దాంతో అలకలు, అసంతృప్తులు, అసహనాలు, ఆందోళనల వరకూ వెళ్లాయి. ఇది ఈసారి విజయం మీద ప్రభావితం చేసే అంశంగా ఉండబోతోంది.

**ప్రభుత్వ వ్యతిరేకత**

అర్బన్ ప్రాంతాల్లో కూటమికి బలం ఎక్కువ. 2024 ఎన్నికలే కాకుండా 2019లో సైతం టీడీపీ ఉనికి చాటుకున్న నియోజకవర్గాల్లో దాదాపు అర్బన్ ప్రాంతాలే ఉన్నాయి. అలాంటి ప్రాంతంలో ఈసారి మధ్యతరగతిలో కూడా కూటమి ప్రభుత్వం పట్ల కొంత అసంతృప్తి ఉంది. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోవడం, అవినీతి పెరిగిపోవడం వంటివి ప్రభావితం చేస్తున్నాయి. రోడ్లు అభివృద్ధి, పెట్టుబడుల కోసం ప్రయత్నాలు వంటివి కొంత సానుకూలతని కొనసాగిస్తున్నాయి. కానీ మునిసిపల్ ప్రాంతాల్లో కొత్తగా విస్తరించిన శివారు ప్రాంతాలకు తాగునీటి సరఫరా, డ్రెయిన్లు వంటివి అభివృద్ధి చేయలేదన్న అభిప్రాయముంది. దానికి తోడు ఆస్తిపన్ను పెంపుదల విషయంలో జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొనసాగించడం చాలామందిని అసంతృప్తికి గురిచేస్తోంది. విద్యుత్ ఛార్జీల భారం సామాన్యులకు ఉపశమనం కలిగించిన దాఖలాలు లేవు. నిత్యాసవర సరుకుల ధరాభారం ప్రభుత్వ వ్యతిరేకతకు దారితీస్తోంది. అయితే పట్టణాల్లో కూటమికి కలిసొచ్చే అంశం నేటికీ వైఎస్సార్సీపీ తీరు పట్ల ఓటర్లలో పూర్తిగా సంతృప్తి లేదు. విపక్షంలో ఉన్నప్పటికీ ఆపార్టీ తీరు మారలేదన్న వాదన వినిపిస్తోంది. వైఎస్ జగన్ పట్ల వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉండడం కూటమికి కొంత మేర కలిసివస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో కూటమి పక్షాల్లో అనైక్యత కొంపల మీదకు తీసుకొచ్చే స్థాయికి చేరడం కలవరపరిచే అంశం.